క్లుప్తంగా...

పోలీసుల సేవలు అభినందనీయం

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రశంసించారు. ఠాణా ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌ఓ మట్టంరాజు సరికొండ, ఎస్‌ఐలు జ్ఞానేశ్వర్, ఆంజనేయులతో పాటు బదిలీపై వెళ్తున్న అడ్మిన్ ఎస్‌ఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు తుల్జారామ్, రమేష్, సాయికృష్ణ, హరీష్ ఇతర సిబ్బందికి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మట్టంరాజు మాట్లాడుతూ.. ప్రజల సహాయ సహకారాలతో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మహాత్మా, చంద్రశేఖర్, విష్ణు, అనీల్, నవీన్, బాలాజీ, రాజేందర్ సింగ్, నవీన్‌చారీ, టింకు, రవి పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమ చట్టం తీసుకురావాలి

అడ్డగుట్ట: గృహ కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం చట్టం తేవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. బుధవారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో గృహ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహ కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదన్నారు. ఈఎస్‌ఐ, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వారం రోజుల్లో ఒక రోజు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధ కార్మికులకు పింఛన్ అమలు చేయాలన్నారు. అనంతరం పలువురు గృహ కార్మికులు మాట్లాడుతూ.. సంవత్సరాల తరబడి పని చేస్తున్నా వేతనం పెరగలేదని దీంతో పని చేయలేని స్థితికి చేరుతున్నామన్నారు. దొంగతనం, లైంగిక తదితర వేధింపులకు గురవుతున్నామని చెప్పుకొచ్చారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

లాలాపేట: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా కుకుమాని వారి తోట ప్రాంతానికి చెందిన షేక్ జానీ పాషా(29), పోకల రవికిరణ్(20) స్నేహితులు. ఇటీవల జరిగిన ఐపీఎల్‌లో బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోయారు. ఈ క్రమంలో సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. దిలీప్ అనే వ్యక్తి ద్వారా రాజమండ్రి నుంచి తీసుకువచ్చిన గంజాయిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సీతాఫల్‌మండి పార్థివాడ ప్రాంతంలో బుధవారం ఓ వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావిలో చేపట్టిన సివరేజీ పైప్‌లైన్ పనులను బుధవారం కార్పొరేటర్ సామల హేమ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆదేశాల మేరకు నూతన మంచినీటి, సివరేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులు ముమ్మరంగా చేపట్టామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు.

పనుల పరిశీలన..

మహ్మద్‌గూడ వద్ద నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులను సామల హేమ పరిశీలించారు. రూ.19 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్లు నవ్య, అన్విత్, ఏఈ కౌశిక్, నాయకులు ఎర్రజ్యోతి, అనిత, సరోజినీ, లలిత, అరుణ, శైలేందర్, జకీర్, చక్రపాణి, శ్రీనివాస్, లోకేష్, శరణ్ పాల్గొన్నారు.

ఉత్సవాలను బహిష్కరించడం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పిడమర్తి రవి బహిష్కరించడం సిగ్గుచేటు అని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ బండారు వీరబాబు బుధవారం పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం మౌనంగా ఉంటూ కోట్ల రూపాయాలను సంపాదించుకున్న ఆయన నేడు పదవులు లేకపోవడంతో సీఎం కేసీఆర్ పై విమర్శలు చేయడం దారుణమన్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పిడమర్తి రవిని ప్రజలు సహించరన్నారు. నిజమైన ఉద్యమకారుడైతే పదవుల కోసం కాకుండా ప్రజల అభివృద్ధికి పని చేయాలన్నారు. సంపాదనకు మరిగి పదవుల కోసం వెంపర్లాడు పిడమర్తి రవికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వీరబాబు హెచ్చరించారు.

2 ట్రాఫిక్ ఠాణాలకు శ్రీకారం

- చిలకలగూడ, బోయిన్‌పల్లిలో ఏర్పాటు
- జూన్ 2న ప్రారంభానికి సన్నాహాలు



నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఏరియాలో నూతనంగా రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు రానున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా నూతన స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో కసరత్తులు పూర్తి చేశారు. జూన్ 2న ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ దిశగా పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఆయా స్టేషన్లకు సిబ్బంది నియామకం పూర్తి చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయిలో అధికారులు ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. కిందిస్థాయి సిబ్బంది నియామకాన్ని పూర్తి చేశారు. ఎస్.ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, కార్యాలయం సిబ్బంది నియామకాలను ఇప్పటికే చేపట్టినట్లు తెలిసింది. నూతన పోలీసు స్టేషన్ల ఏర్పాటు కోసం ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆయా ఏరియాలను పరిశీలించి ఇందుకు సంబంధించి సరిహద్దులను కూడా ఖరారు చేశారు. జూన్ 2 నుంచి నూతన ట్రాఫిక్ పోలీసులు తమ తమ విధుల్లో నిమగ్నం కానున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విధుల సౌలభ్యం

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించి వాహనచోదకులు సులువుగా రాకపోకలు సాగించే విధంగా నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు అంకురార్పణ జరిగింది. గతంతో పోల్చుకుంటే సికింద్రాబాద్‌లో విపరీతమైన ట్రాఫిక్ పెరిగిపోయింది. వేలాది వాహనాల రాకపోకలను నియంత్రించడం తలకు మించిన భారంగా మారింది. పాత స్టేషన్ల పరిధిని కుంచిస్తూ నూతన స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీని వల్ల పోలీసు సిబ్బంది సునాయసంగా ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు వారిపై ఒత్తిడి కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

మారనున్న సరిహద్దులు..

సికింద్రాబాద్ ఏరియా పరిధిలోని పలు పోలీసు స్టేషన్ల ట్రాఫిక్ సరిహద్దులు మారనున్నాయి. పాత ఏరియాలు కొత్త స్టేషన్ల పరిధిలోకి రానున్నాయి. గోపాలపురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పద్మారావునగర్, ఈద్గామైదానం, అభినవనగర్ కాలనీ తదితర ప్రాంతాలు నూతన చిలకలగూడ పోలీసు స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. అదే విధంగా పాత తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ఏరియాలు నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. నూతన చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి లా అండ్ పోలీస్‌స్టేషన్లు చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఏరియాలు వస్తాయి. బోయిన్‌పల్లి నూతన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి లా అండ్ ఆర్డర్ బోయిన్‌పల్లి పరిధితో పాటు కార్ఖానాలోని కొన్ని ఏరియాలు వచ్చి ఇందులో కలువనున్నాయి. నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను పాత బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ నుంచి కార్యకలాపాలు సాగుతాయి. పాత బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నూతన భవనం నుంచి కార్యకలాపాలు సాగనున్నాయి.

ట్రాఫిక్ నియంత్రణ సులువు

సికింద్రాబాద్‌లో నూతన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు కొంత వరకు తగ్గుముఖం పడుతాయి. ఏరియా పరిధిని కుంచించడం ద్వారా పోలీసు విధి నిర్వహణతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులువవుతుంది. జూన్ 2న బోయిన్‌పల్లిలో నూతన ట్రాఫిక్ పోలీసుస్టేషన్, అదే విధంగా తార్నాక హుడా కాంప్లెక్స్‌లో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తాం.

–గంగిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి



పార్టీ శ్రేణులతో సమావేశమైన కార్పొరేటర్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులకు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కార్పొరేటర్ హేమలత పిలుపునిచ్చారు. బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఆవరణలో జరిగిన బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం కోట్లాది రూపాయల ఖర్చుతో అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో డబుల్ బెడ్రూమ్‌లు, సీసీ రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి వంటి అనేక పనులు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామన్నారు. ఈ సమావేశంలో ప్రేమ్, ఫయామ్, రాజేందర్, నాగభూషణం, క్రిష్ణ, కమల్‌కుమార్, అబ్బాస్, జావీద్, వెంకట్ బాబూ, రంజిత్, మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

రూ. 1.85 కోట్లతో డ్రైనేజీ పనులు



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న లాస్య నందిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ. 1.85 కోట్లతో పనులు ప్రారంభం కానున్నాయని లాస్య నందిత తెలిపారు. బుధవారం ఆమె మోండా డివిజన్‌లో సోదరి నివేదిత, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పర్యటిస్తూ మాట్లాడారు. తమ తండ్రి సాయన్న ప్రతిపాదనలతో మోండా డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో రూ.35 లక్షలు, జీవన్ పాయింట్ గ్రేవ్ యార్డు నాలా ప్రాంతంలో రూ.10 లక్షలు సంతోషి మాతా దేవాలయం వద్ద రూ.18 లక్షలు, రెజిమెంటల్‌బజార్, పరికిబస్తీ, సలూజ నర్సింగ్ హోమ్, తదితర ప్రాంతాల్లో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. తన తండ్రి సాయన్న హయాంలో నిధులు మంజూరైతే కొందరు నేతలు తామే మంజూరు చేయించినట్లు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ ముదిరాజ్, కర్ణకుమార్, సంతోష్, అశోక్, సృజన్, గోపీ, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో 'ఆవిర్భావ వేడుకలు'



వివరాలు వెల్లడిస్తున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో రేపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబిన్‌సన్ బుజ్జి తెలిపారు. బుధవారం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల్లో తెలంగాణ స్ఫూర్తిని నింపేందుకు తమ వంతు బాధ్యతగా తెలంగాణ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ ఉత్సవాలు, బోనాల జాతర, పోతరాజుల విన్యాసం, తెలంగాణ ధూంధాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమాలకు డా.ఇన్నారెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్, బీఆర్‌ఎస్ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉద్యమకారులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌నూర్, సయ్యద్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

రసూల్‌పురా: నగరవాసులు ఎలక్ట్రిక్ వాహనాలను అధికంగా వినియోగిస్తున్నారని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలో గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటో షోరూంను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ సంస్థ సీఈవో సుశాంత్ జెనా మాట్లాడుతూ.. గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటోను తెలంగాణలో ప్రవేశ పెడుతున్నామని వినియోగదారులు తమ పెట్టుబడిపై అధిక రాబడిని ఈ సూపర్ ఆటో ద్వారా పొందవచ్చన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అమ్మకాలు, విడిభాగాలు సర్వీస్ సేవలను అందజేస్తామని ఆటో మోటివ్స్ నగర డీలర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్ రెడ్డి, తేజ పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ విద్యాధర్, పాత లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవం.. విష్ణు సహస్రనామ పారాయణం



సామూహిక విష్ణు సహస్రనామ పారాయణంలో ఈఓ అన్నపూర్ణ

సనత్‌నగర్: నగరంలోని గోపన్‌పల్లిలో బుధవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జరిగిన 'విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనం' ప్రారంభోత్సవం సందర్భంగా మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణంతో ఆధ్యాత్మిక పరిమళా వెల్లివెరిసింది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలు ప్రారంభోత్సవానికి తరలివెళ్లి విష్ణు పారాయణం చేసి దైవ చింతనను పెంపొందింపజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమ సదనం ఏర్పాటు చేయడం మిగతా రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సామూహిక పారాయణ ఏర్పాట్లను ఘనంగా నిర్వర్తించిన అన్నపూర్ణను ఉన్నతాధికారులు అభినందించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతి, వికాసానికి తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని వేణుగోపాల స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న వీరాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని మతాల పండుగలు ఘనంగా నిర్వహించుకునేలా ప్రోత్సహిస్తుందన్నారు. అన్ని వర్గాల పండుగల సమయంలో కానుకలు, ఉత్సవాలకు ఆర్థిక సాయం ఇచ్చే సంప్రదాయం గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రవికాంత్, వాసు, ఉపేందర్, శ్రీనివాస్, వినోద్, వెంకట్, రాము, లావణ్య, శివ, రాజు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి మంత్రికి వినతి

పద్మారావునగర్: క్రిష్ణానగర్‌లోని పురాతన ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని పునర్ నిర్మాణానికి బుధవారం స్థానికులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 70 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన దేవాలయం శిథిలావస్థకు చేరిందని స్థానికులు అమ్మవారికి పూజలు చేస్తూ బోనాలు వేడుకలను కూడా ఘనంగా నిర్వహిస్తారన్నారు. దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని వినతిలో కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఏసూరి మహేష్, డి. జనార్ధన్, సుధాకర్, లావణ్య, లక్ష్మీ, సరిత, మహేందర్ కుమార్, యశోద, రామారావు, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

బల్కంపేట-సనత్‌నగర్ మార్గం విస్తరణలో కదలిక

కూల్చివేతలు షురూ



భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: దశాబ్ద కాలానికి పైగా సాగుతున్న ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద బల్కంపేట–సనత్‌నగర్ మార్గం ఎట్టకేలకు సుగమం చేసే దిశగా అధికారులు మరో అడుగు ముందుకువేశారు. బ్రిడ్జి కింద సబ్ వే విస్తరణకు అడ్డుగా ఉన్న ప్రైవేటు ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం చెల్లించి వాటిని కూల్చివేసే ప్రక్రియలో కదలిక వచ్చింది. సబ్ వే విస్తరించేందుకు పదేళ్లుగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. ఫతేనగర్ బ్రిడ్జి నిర్మాణం జరిగాక బ్రిడ్జి కింది నుంచి సనత్‌నగర్–బల్కంపేట మార్గంలో మాత్రమే రాకపోకలు సాగుతూ వస్తున్నాయి. మరోవైపు అంటే బల్కంపేట–సనత్‌నగర్ మార్గంలో ప్రైవేటు ఆస్తులు ఉండడం.. ఆస్తులు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదం జాప్యానికి కారణమైందనే చెప్పాలి. అప్పట్లో మార్కెట్ ధర కన్నా రెండింతలు నష్టపరిహారం ఇస్తామని అధికారులు ప్రకటించినా అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ప్రతిపాదనను తెర మీదకు తీసుకురాగా కొంతమంది మాత్రమే అంగీకరించారు. దీంతో సబ్ విస్తరణ గత కొన్నేళ్లుగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ క్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఇక్కడి భవన యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి టీడీఆర్ ప్రతిపాదనకు ఒప్పించడంతో బుధవారం కూల్చివేతల ప్రక్రియ ప్రారంభం అయింది.

జూలై 24, 25 తేదీల్లో 'ఎస్‌ఐడబ్ల్యూపీసీ' గ్లోబల్ సదస్సు



వెబ్‌సైట్ ఆవిష్కరణలో పాల్గొన్న బలరామ్‌బాబు

సనత్‌నగర్: సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ (ఎస్‌ఐడబ్ల్యూపీసీ) అంతర్జాతీయ సదస్సుకు నగరం వేదిక కానుంది. తెలంగాణ టూరిజం సహకారంతో తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో టీసీఈఐ ఎస్‌ఐడబ్ల్యూపీసీ గ్లోబల్–2023 పేరిట జరిగే ఈ సదస్సు జూలై 24, 25 తేదీల్లో హైటెక్స్‌లోని హెచ్‌ఐసీసీలో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం బేగంపేటలోని హోటల్ హరితప్లాజాలో జరిగిన కార్యక్రమంలో సదస్సు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీఈఐ అధ్యక్షుడు బలరామ్‌బాబు మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు భారతీయ వివాహ పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతారన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలో అంతర్లీనంగా ఉండే విభిన్నమైన అంశాలకు సంబంధించిన లోతైన పరిజ్ఞానాన్ని ప్రపంచానికి అందించడంతో పాటు ఈవెంట్ రంగానికి చెందిన జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ ప్రధాన కార్యదర్శి రవి బురా, శ్రవణ్ మాదిరాజులతో పాటు పలువురు వెడ్డింగ్ ప్లానింగ్ నిపుణులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ తెలిపారు. బుధవారం ఏడో వార్డు పెరుమాళ్ టెంపుల్ బస్తీలో బోర్డు నిధులతో చేపట్టే తాగునీటి పైపులైను పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల బస్తీబాట నిర్వహించిన సందర్భంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు తమ దృష్టికి తీసుకురావడంతో పైపులైను పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యశ్రీ, శంకర్రావు, ప్రశాంత్ ప్రభు, మల్లేష్, రుక్మయ్య, మనోహర్, అజయ్‌కుమార్, శివకుమార్, సుధీర్, టింకు పాల్గొన్నారు.

ట్విన్ టవర్స్ మీకు.. శ్మశానం లాంటి హాస్టళ్లు మాకా?

- డా. విశారధన్

లాలాపేట: వేల కోట్లతో ట్విన్ టవర్స్ మీకు.. శ్మశానం లాంటి హాస్టళ్లు మాకా అని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) స్టేట్ ప్రెసిడెంట్ డా. విశారధన్ మహారాజ్ బుధవారం ఓ పత్రికా ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వం రాష్ట్ర ఖజానాలోని ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు పెడుతుందని హెచ్‌ఓడీల కోసం ట్విన్ టవర్స్ పేరుతో వేల కోట్ల రూపాయల ఖర్చుకు ప్రణాళిక సిద్ధం చేసిందని ఈ కాంట్రాక్ట్ ద్వారా తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ వందల కోట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ట్విన్ టవర్స్‌పై పెట్టే ఖర్చును విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాలకు ఉపయోగిస్తే లక్షల మంది విద్యార్థుల జీవితాలు బాగుపడేవని అభిప్రాయం వ్యక్తం చేశారు.

దక్షిణాదిపై మంత్రి కేటీఆర్ స్పందనను స్వాగతిస్తున్నాం

లాలాపేట: ఉత్తరాది బీజేపీ పాలనలో అడుగడుగునా దగా పడుతున్న దక్షిణాదిపై మంత్రి కేటీఆర్ స్పందనను స్వాగతిస్తున్నట్లు పొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2026లో డీలిమిటేషన్ సందర్భంగా దక్షిణాదిలో పార్లమెంట్ సీట్లు తగ్గుతాయన్న మంత్రి కేటీఆర్ ప్రకటన వాస్తవం అన్నారు. ఉత్తరాది రాజధాని ఢిల్లీకి కేటాయిస్తున్న నిధులు మొత్తం దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకు కేటాయిస్తున్న నిధులతో సమానం అన్నారు. దీంతో పాటు దక్షిణాదికి సుప్రీం కోర్టు బెంచ్, దక్షిణాది అభివృద్ధి మండలి, యూపీఎస్సీ తరహా ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు, వాటర్ బోర్డు, ఇండస్ట్రీయల్ కారిడార్ వంటి అంశాలపై మంత్రి కేటీఆర్ ప్రస్తావించాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలని, హాస్టల్ వసతి, ఫెలోషిప్‌లు అందచేయాలని, డిగ్రీ కాలేజీలో రీసెర్చ్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆజాద్, నెల్లి సత్య, అఖిల్, మహేష్, గోవర్ధన్, మధు పాల్గొన్నారు.

శభాష్ సనిత

ప్రయాణికురాలిని కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్



ప్రయాణికురాలిని కాపాడుతున్న సనిత సీసీ ఫుటేజీ

సనత్‌నగర్: కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదానికి గురైన ఓ ప్రయాణికురాలని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సనిత కాపాడారు. విధినిర్వహణలో అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించిన సనితను ఉన్నతాధికారులు అభినందించారు. మే 30వ తేదీన లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు వెళ్తున్న రైలు బేగంపేటకు చేరుకుంది. అక్కడి నుంచి రైలు తిరిగి బయలుదేరుతున్న సమయంలో ఒక ప్రయాణికురాలు కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించారు. రైలు వేగం పుంజుకోవడంతో ఆ ప్రయాణికురాలు ప్లాట్‌ఫారం, ట్రైన్ మధ్య గ్యాప్‌లో పడిపోయే పరిస్థితి నెలకొంది. ఇది గమనించిన కానిస్టేబుల్ సనిత ప్రయాణికురాలి చేతిని పట్టుకొని గట్టిగా లాగడంతో ఆమె బయట పడింది. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు యూనిఫారంలో ఉన్న పౌరులుగా వ్యవహరిస్తూ 'మిషన్ జీవన రక్ష' కింద ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను కాపాడుతున్నారని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. నల్గొండ జిల్లాకు చెందిన కె.సనిత 2020లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చేరారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

139కు సమాచారం ఇవ్వండి...

రైల్వే స్టేషన్‌లలో లేదా రైళ్లలో ఏవైనా ప్రమాదకర పరిస్థితులు కనిపించినప్పుడు ఆర్పీఫ్ సిబ్బందికి లేదా రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు సమాచారం అందజేయాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో స్విగ్గీ డెలివరీ బాయ్ మృతి

సనత్‌నగర్: హాస్టల్ గదిలో స్విగ్గి డెలివరీ బాయ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన గోపాలన్ శ్రీనివాస్ (50) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ భవానీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 28న విధులు ముగించుకుని హాస్టల్‌కు వచ్చిన గోపాలన్ శ్రీనివాస్ భోజనం చేసి గదిలోకి వెళ్లి బయటకు రాలేదు. మంగళవారం మధ్యాహ్నం నుంచి హాస్టల్‌లో దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు హాస్టల్ యజమానికి ఫిర్యాదు చేశారు. హాస్టల్ గదులన్నీ తనిఖీ చేయగా గోపాలన్ శ్రీనివాస్ గది నుంచి ఎక్కువగా దుర్వాసన రావడంతో లోపలికెళ్లి చూడగా బెడ్‌పై శవమై ఉండడం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే.. గోపాలన్ శ్రీనివాస్ గత కొంతకాలంగా హైబీపీ సమస్యతో బాధపడుతుండడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టడంతో అందుకు సంబంధించిన చికిత్స పొందుతున్నట్లు గదిలో లభ్యమైన మెడికల్ రిపోర్టుల ద్వారా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 47 మందిపై కేసులు నమోదవ్వగా 37 మందికి జరిమానా విధించారు. అలాగే మొదటిసారి పట్టుబడ్డ ఏడుగురితో పాటు రెండోసారి పట్టుబడ్డ మరో ముగ్గురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379